

అంతర్జాతీయ అబాకస్‌లో...

అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో ఉమ్మడి వరంగల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. ఆన్‌లైన్‌లో పరీక్ష రాసి వివిధ కేటగిరీల్లో బహుమతులు గెలుచుకున్నారు.

- 10లో▸



10 నుంచి పీజీ సెమిస్టర్ పరీక్షలు

కేయూ పరిధి అన్ని జిల్లాల్లో ఈనెల 10 నుంచి పీజీ కోర్సుల సెకండియర్ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి తెలిపారు.

- 10లో▸

గరిష్టం/కనిష్టం

34⁰/17⁰

వాతావరణం

ఉదయం మంచుతోకూడిన చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రిపూట చలి తీవ్రత మరింత అధికం అవుతుంది.

న్యూస్‌రీల్

నేడు దివ్యాంగుల స్లాట్ బుకింగ్

జనగామ రూరల్: జిల్లాలోని అర్హులైన దివ్యాంగుల సదరం క్యాంపు కోసం మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ ప్రారంభం అవుతుందని డీఆర్‌డీఓ రాంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శారీరక దివ్యాంగులకు(కొత్తవారికి 90, రెన్యూవల్ 90), వినికిడి లోపం ఉన్న వారికి(కొత్తవి 40, రెన్యూవల్ 10) అవకాశం ఉందని, 9,14,21 తేదీల్లో క్యాంపులుంటాయని, స్లాట్ బుకింగ్ రశీదు, ఆధార్, రేషన్‌కార్డు, పాస్‌ఫొటో, మెడికల్ రిపోర్టులు తీసుకొని జిల్లా ఆస్పత్రిలో హాజరుకావాలని సూచించారు.

'ఉపాధి' పనులు సద్వినియోగం చేసుకోవాలి



జనగామ రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ రాంరెడ్డి అన్నారు. సోమవారం గానుగుపహాడ్‌లో చేపట్టిన ఉపాధి పనులు ఆయన పరిశీలించి మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో అధికారులు ఎప్పటికప్పుడు పనులు సజావుగా సాగేలా చూడాలని, కూలీలకు తగిన వసతులు కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హసీం, ఏపీఓ భిక్షపతి, టీఏ అనిల్, ఎఫ్ఏ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో అఖిల ప్రతిభ



నర్మెట: నర్మెట మండలం బొమ్మకూర్‌కు చెందిన ఇస్లావత్ అఖిల కరాటే పోటీల్లో ప్రతిభ చాటింది. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో రుద్రమదేవి, ఛోటాఖాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో పాఠశాల, కళాశాల స్థాయి విద్యార్థులకు ఆదివారం రాష్ట్ర స్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. 20 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా డిగ్రీ చదువుతున్న అఖిల అండర్–19 విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి సినీ హీరో సుమన్ చేతుల మీదుగా అవార్డు, ప్రశంసపత్రం అందుకుంది.

రాష్ట్ర స్థాయి పోటీలకు అంజలి ఎంపిక



జఫర్‌గఢ్: కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని మద్ది అంజలి రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఇటీవల హనుమకొండలో జరిగిన ఉమ్మడి వరంగల్ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన అంజలి ఈనెల 11, 12వ తేదీల్లో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంజలిని ఉపాధ్యాయులు అభినందించారు.

అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన కీర్తన



పాలకుర్తి టౌన్: భోపాల్‌లో ఇటీవల జరిగిన ఖేల్ ఇండియా యూత్ గేమ్స్‌లో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన పాలకుర్తి మండలం గూడూరు చెందిన కీర్తన సత్తా చాటింది. అథ్లెటిక్స్ రెండువేల మీటర్ల స్టిపుల్ చేంజ్‌లో రెండో స్థానంలో నిలిచి రజత పథకం సాధించింది. కీర్తన డిండి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల అథ్లెటిక్స్ అకాడమీ విద్యార్థిని కావడం విశేషం.

జాతీయ అథ్లెటిక్స్‌కు సాయికిరణ్



జనగామ రూరల్: పాట్నాలో ఈనెల 18న జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిని ఎనిమిదో తరగతి విద్యార్థి జి.సాయికిరణ్ ఎంపికయ్యాడు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ కనగాల శ్రీనివాస్ సోమవారం వెల్లడించారు.

అభివృద్ధి.. సంక్షేమం

బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యం



- సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు
- దేవాదులకు రూ.285కోట్లు.. ఎస్సారెస్పీకి రూ.300కోట్లు
- రూ.750కోట్లతో టూరిజం స్పాట్‌గా కాళేశ్వరం.. స్మార్ట్‌సిటీకి రూ.175.68కోట్లు
- ప్రస్తావన లేని మామునూరు ఎయిర్ పోర్టు.. 'నియో' రైలుకు ఈసారీ' మొండిచెయ్యి

సాక్షిప్రతినిధి, వరంగల్:

రాష్ట్ర ప్రభుత్వం 2023–24 బడ్జెట్‌లో ఆచితూచి వ్యవహరించిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సోమవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ బాగానే ఉన్నా.. కేటాయింపుల్లోనే ఇంకొంత స్పష్టత ఉండాల్సి ఉంటుందంటున్నారు. అయితే గత బడ్జెట్‌తో పోలిస్తే ఈసారి అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చారన్న చర్చ కూడా జరుగుతోంది. సాగునీటి ప్రాజెక్టుల పెండింగ్ బిల్లుల చెల్లింపులతోపాటు పనులు పూర్తి చేసేందుకు, గతేడాది మంజూరు చేసిన మెడికల్ కళాశాలలు, ఆస్పత్రుల నిర్మాణానికి నిధులు కేటాయించారు. దేవాదుల ఎత్తిపోతల పథకం, ఎస్సారెస్పీ, వరద కాల్వలతోపాటు భారీ, మధ్య, చిన్నతరహా ప్రాజెక్టులకు కేటాయింపులు దక్కాయి. ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న కాళేశ్వరం టూరిజం సర్క్యూట్‌కు రూ.750కోట్లుగా పేర్కొన్నారు. మేడిగడ్డ నుంచి మల్లన్నసాగర్ వరకు టూరిజం సర్క్యూట్ ఏర్పాటుకు రెండేళ్ల కిందటే డిజైన్ ఖరారు చేశారు. విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ రంగాలకు తోడు దళిత బంధు, డబుల్ బెడ్రూం ఇళ్లకు ప్రత్యేక నిధులు ప్రతిపాదించారు. వివిధ పథకాల కింద కేంద్ర ప్రభుత్వం స్పాన్సర్ చేస్తున్న ప్రాజెక్టులకు సంబంధించి రాష్ట్రం వాటాగా మ్యాచింగ్ గ్రాంట్లను ప్రకటించింది. అయితే బడ్జెట్‌లో మామునూరు ఎయిర్‌పోర్టు ప్రస్తావనే లేకపోగా, వరంగల్ మెట్రో(నియో) రైలుకు రూపాయి కూడా ఇవ్వలేదు. నిరుద్యోగ భృతిపైనా స్పష్టత ఇవ్వలేదు.

ఆశల పల్లకిలో దళిత బంధు, 'డబుల్' అర్హులు..

'దళిత బంధు' పథకం కింద బడ్జెట్‌లో పేర్కొన్న నిధులు కేటాయిస్తే ప్రతీ నియోజకవర్గంలో 1,100 మంది చొప్పున ఈ ఏడాది ఉమ్మడి వరంగల్‌లో 13,200 మందికి లబ్ధి చేకూరనుంది. ఉమ్మడి జిల్లా పరిధి 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 13,200 కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున వర్తింపజేయనున్నారు. అలాగే డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం ఉమ్మడి జిల్లాలో రూ.1.98లక్షల మంది దరఖాస్తు చేసుకుని ఎదురుచూస్తున్నారు. ఈ బడ్జెట్‌లో రూ.12వేల కోట్లు కేటాయించగా.. ఒక్కో నియోజకవర్గానికి రూ.100కోట్ల వరకు ఖర్చు చేసినా.. 12 నియోజకవర్గాల్లో సుమారు 40 వేల మందికి లబ్ధి చేకూరే అవకాశం ఉంది. నియోజకవర్గ అభివృద్ధి నిధుల కింద రూ.603.76కోట్లు కేటాయించగా.. ఉమ్మడి జిల్లాకు రూ.100కోట్ల వరకు వచ్చే అవకాశం ఉంది. పోలీస్ కమిషరేట్, పోలీస్‌స్టేషన్ల నిర్మాణం, ఆధునికీకరణకు కేటాయించిన నిధుల్లో ఉమ్మడి జిల్లాకు రూ.24కోట్ల వరకు ఉంది. కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ కింద జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలను కొనసాగిస్తున్నారు. వంటలు చేసేవారి పారితోషికం రూ.1,000 నుంచి రూ.3వేలకు పెంచగా.. 8,109 మందికి లబ్ధి చేకూరనుంది.

ఊసేలేని మామునూరు, మెట్రో రైలు..

ఉడాన్ 5.0లో మామునూరు ఎయిర్‌పోర్టు రన్నింగ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా.. రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ఏమాత్రం పట్టించుకోలేదు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా మామునూరు ఎయిర్‌పోర్టుకు అడుగులు పడతాయనుకుంటే అడియాసలే అయ్యాయి. వరంగల్ నగరం విస్తరిస్తున్నందున మాస్టర్‌ప్లాన్–2041కు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం మెట్రోనియో ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. మూడేళ్లు గడుస్తున్నా నిధుల కేటాయింపు లేదు.

ఆస్పత్రులు, కాలేజీలకు ఫండ్స్..

మెడికల్ కాలేజీలు, ఆస్పత్రుల నిర్మాణానికి రూ.1,033కోట్లు కేటాయించగా.. ఇందులో ఉమ్మడి వరంగల్‌లో కొత్తగా కేటాయించిన వైద్య కళాశాలలు, ఆస్పత్రుల నిర్మాణ పనులు జోరందుకోనున్నాయి. హైదరాబాద్, వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు ప్రభుత్వం రూ.500కోట్లు కేటాయించింది. వరంగల్‌లో శరవేగంగా సాగుతున్న 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు మరింత ఊపందుకోనున్నాయి. సెంట్రల్ స్పాన్సర్డ్ పథకాల కింద స్మార్ట్‌సిటీలకు స్టేట్ వాటాగా రూ.391.99కోట్ల మ్యాచింగ్ గ్రాంటు ఇచ్చిన ప్రభుత్వం వరంగల్ స్మార్ట్ సిటీకి రూ.175.68కోట్లు ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు రూ.300కోట్లు కేటాయించగా.. గ్రేటర్ వరంగల్‌కు రూ.20కోట్లు ఇచ్చారు. ఇదిలా ఉండగా.. మామునూరు వెటర్నరీ సైన్సెస్ కాలేజీకి రూ.20కోట్లు, కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీకి రూ.1.60కోట్లు, మేడారానికి రూ.2.96కోట్లిచ్చారు. తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్స్ కోటా కింద వరంగల్, కరీంనగర్‌లకు కలిపి రూ.16.53కోట్లు కేటాయించారు.

ప్రాజెక్టులకు నిధులు..

నీటిపారుదల రంగానికి రూ.26,885కోట్లు కేటాయించిన ప్రభుత్వం.. ఉమ్మడి వరంగల్ ప్రాజెక్టులకు ఈసారి కూడా నిధులిచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టులో పెండింగ్ పనులతోపాటు మూడో టీఎంసీకి కలిపి రూ.2,614.75కోట్లు కేటాయించారు. జేసీఆర్ దేవాదుల ఎత్తిపోతలకు రూ.500కోట్లతో ప్రతిపాదనలు పంపగా.. రూ.285కోట్లిచ్చారు. శ్రీరాంసాగర్ స్టేజ్–1 కింద ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్‌కు రూ.300కోట్లుగా పేర్కొన్న ప్రభుత్వం స్టేజ్–2కు రూ.20కోట్లిచ్చింది. పూర్వ వరంగల్, కరీంనగర్ జిల్లాలను తాకే ఇందిరమ్మ వరద కాల్వ ప్రాజెక్టుకు రూ.219.39కోట్లు, పీవీఆర్ కంతనపల్లికి రూ.12.04కోట్లు, రామప్ప, పాకాలకు రూ.5కోట్ల చొప్పున, లక్నవరానికి రూ.2కోట్లు, మల్లూరుకు రూ.కోటి ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టును టూరిజం సర్క్యూట్‌గా మార్చేందుకు రూ.750కోట్లు కేటాయించింది. మేడిగడ్డ నుంచి మల్లన్నసాగర్ వరకు 9 ప్యాకేజీలు 880.24 ఎకరాల్లో విస్తరించే పనులకు 'సార్' ఇంటర్నేషనల్ కన్సల్టెన్సీ రెండేళ్ల క్రితమే డిజైన్ రూపొందించింది. 15 ప్రత్యేక థీమ్ పార్కులు, ఉద్యానవనాలు ఏర్పాటు చేయనున్నారు.

అభిప్రాయాలు : 10లో..

నిరుపేదలకు ఉచిత న్యాయ సేవలు

- జిల్లా న్యాయమూర్తి కె.శైలజ
- ఎల్ఈడీసీఎస్ ప్రారంభం



ఎల్ఈడీసీఎస్ ప్రారంభోత్సవంలో జడ్జి, తదితరులు

జనగామ: పేదలకు ఉచిత న్యాయ సేవలందించేందుకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం(ఎల్ఈడీసీఎస్) ఏర్పాటు చేసినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా న్యాయమూర్తి కె.శైలజ అన్నారు. పట్టణంలోని హనుమకొండ రోడ్డున ఉన్న పాత డీఆర్డీఓ కార్యాలయంలో ఎల్ఈడీసీఎస్‌ను హైదరాబాద్ నుంచి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భుయన్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ పి.నవీన్‌రావు సోమవారం వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం జడ్జి శైలజ మాట్లాడుతూ కోర్టుకు వచ్చి, న్యాయవాదులకు ఫీజు ఇచ్చుకోలేని పేదలకు ఎల్ఈడీసీఎస్ అండగా నిలుస్తుందన్నారు. ఒక్కరూపాయి ఖర్చు లేకుండా అందించే ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందుకు రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్‌గా అడ్వకేట్ మంచాల రవీందర్, సహాయకులుగా ఇట్టబోయిన జ్యోత్స్న, రాగల్ల శ్రీహరిని నియమించిందని చెప్పారు. వీరు కోర్టుకు వచ్చే పేదల పక్షాన నిలబడి న్యాయసేవలు అందిస్తారని తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి పి.ఆంజనేయులు మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం పై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి పృథ్వీరాజ్ డీటీ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్.నర్మద, రెండవ తరగతి జడ్జి వెంకట్‌రాంరెడ్డి, సీఐ ఎలబోయిన శ్రీనివాస్, తహసీల్దార్ రవీందర్, న్యాయవాదులు స్టీఫెన్, ఆలేటి సిద్దిరాములు, సాదిక్, ఈ డిస్ట్రిక్ మేనేజర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మైనార్టీ సెల్ స్టేట్ వైస్ చైర్మన్‌గా జమాల్



జనగామ: కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ స్టేట్ వైస్ చైర్మన్‌గా జనగామకు చెందిన జమాల్ షరీఫ్‌ను నియమిస్తూ రాష్ట్ర చైర్మన్ షేక్ అబ్దుల్లా సోహెల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జమాల్.. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, షేక్ అబ్దుల్లా సోహెల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'హాథ్ సే హాథ్' జోష్..



ప్రాజెక్టు నగర్ నుంచి పస్రా వైపు పాదయాత్రగా వస్తున్న రేవంత్‌రెడ్డి

- మేడారంలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పాదయాత్ర షురూ..
- గట్టమ్మ, సాయిబాబా ఆలయాల్లో పూజలు
- వనదేవతలకు ఎత్తు బంగారం సమర్పణ
- తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు

ములుగు/ఎస్ఎస్ తాడ్వాయి: టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డి చేపట్టిన 'హాథ్ సే హాథ్ జోడో' యాత్ర సోమవారం ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమైంది. తొలుత ములుగు మండలం గట్టమ్మ, షిర్డీ సాయిబాబా ఆలయాల్లో రేవంత్‌రెడ్డి పూజలు చేశారు. తర్వాత మేడారం చేరుకున్న ఆయనకు ములుగు ఎమ్మెల్యే ధనసరి సీతక్క, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్, పార్టీ నాయకులు స్వాగతం పలికారు. సమ్మక్క, సారలమ్మ పూజారులు గద్దెల వరకు తీసుకురాగా వనదేవతలకు పూజలు చేసి ఎత్తుబంగారం(బెల్లం) సమర్పించారు. గోవిందరాజు, పగిడిద్దరాజులను దర్శించుకున్నారు.

నినాదాలతో మార్మోగిన మేడారం..

రేవంత్‌రెడ్డి వచ్చిన సందర్భంగా తాడ్వాయితో పాటు వివిధ మండలాల నుంచి పార్టీ రాష్ట్ర నాయకులు, ప్రజాప్రతినిధులు, శ్రేణులు మేడారం తరలి వచ్చారు. గద్దెల ప్రాంగణంలో అమ్మవార్లను దర్శించుకుంటున్న సమయంలో పార్టీ శ్రేణులు రేవంత్ సీఎం అంటూ.. నినాదాలు చేశారు. ఇటు ఆదివారం భక్తులతో కళకళలాడిన మేడారం.. రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా సోమవారం జన సందోహం కనిపించింది. పాదయాత్ర సందర్భంగా మేడారంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

తాడ్వాయిలో ఘన స్వాగతం

పస్రా నుంచి తాడ్వాయి మీదుగా రేవంత్‌రెడ్డి మేడారం చేరుకున్నారు. తాడ్వాయిలో సమ్మక్క ఆర్చీ వద్ద ఆయనకు జిల్లా సీనియర్ నాయకుడు బొల్లు దేవేందర్, సర్పంచ్ ఇర్ప సునీల్ దొర, రేగ కళ్యాణి, జిల్లా నాయకులు ఆరెం లచ్చుపటేల్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాక సాంబయ్య, నాయకులు, మహిళలు డోలు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. గజమాలతో రేవంత్‌రెడ్డిని సన్మానించి.. శాలువాతో సత్కరించారు. రేవంత్‌రెడ్డి సాయంత్రం పస్రా నుంచి చల్వాయి వరకు పాదయాత్ర చేస్తున్న సమయంలో స్థానికులు భారీగా స్వాగతం పలికారు.



పస్రాలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

ప్రజాభిమానానికి రుణపడి ఉంటా: ఎమ్మెల్యే డాక్టర్ సీతక్క

రేవంత్‌రెడ్డి వస్తున్నారని తెలిసి ఒక్క పిలుపుతో వేలాదిగా వాహనాలు, ఆర్టీసీ బస్సుల్లో తరలివచ్చిన కార్యకర్తలు, ప్రజల అభిమానికి రుణపడి ఉంటానని ఏఐసీసీ మహిళా ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. రేవంత్ రెడ్డి వస్తున్నారని తెలిసి పోడుదారులకు హక్కు పత్రాలు ఇస్తామని చాటింపు చేయించడం చూస్తే కాంగ్రెస్ పార్టీ అంటే ఏంటో సీఎంకు అర్థమవుతోందన్నారు. దోచుకుతినే బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తారో.. ప్రజలకు న్యాయం చేసే కాంగ్రెస్‌కు ఓటు వేస్తారో.. తేల్చుకోవాలన్నారు.

పోలీసుల భారీ బందోబస్తు

హాథ్ సే హాథ్ జోడో యాత్రకు ఆదిలాబాద్, చెన్నూరు, నర్సంపేట, జయశంకర్ భూపాలపల్లి, భద్రాచలం, మంచిర్యాల నుంచి కార్యకర్తలు భారీగా తరలిరావడంతో ములుగు సబ్ డివిజన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. వాహనాలు వస్తున్నకొద్దీ పార్కింగ్ స్థలాలు మార్చుకుంటూ వెళ్లారు. కాగా.. తొలిరోజు యాత్ర వెంకటాపురం(ఎం) పాలంపేటలో ముగిసింది. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్, రాష్ట్ర, జిల్లా నాయకులు పొన్నాల లక్ష్మయ్య, షబ్బీర్ అలీ, సిరిసిల్ల రాజయ్య, కొండా మురళి, ఎర్రబెల్లి స్వర్ణ, కూచన రవళి, పి.అశోక్, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు మల్లాడి రాంరెడ్డి, భగవాన్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ రవిచందర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్
- గ్రీవెన్స్‌కు వివిధ సమస్యలపై 50 అర్జీలు

జనగామ రూరల్: ప్రజలు అర్జీల ద్వారా తెలియజేసిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు వివిధ సమస్యలపై ప్రజలు 50 అర్జీలు ఇవ్వగా అదనపు కలెక్టర్‌తోపాటు సంబంధిత అధికారులు స్వీకరించారు. అర్జీల్లో రెవెన్యూ విభాగానికి 27, డీఆర్‌డీఓ 5, ఏరియా ఆస్పత్రికి 3, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ 2, ఇతర శాఖలకు 13 ఉన్నాయి.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్, ఇతర అధికారులు

జీవనాధారం కల్పించండి



స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఫత్తేపూర్‌కు చెందిన బాదావత్ రాజుకు పుట్టుకతో రెండు కాళ్లు పడిపోయాయి. చేతి కర్రల సహాయంతో నడుస్తున్నాను. ఎలాంటి ఆధారం లేదు. 'ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తల్లితండ్రులకు భారంగా ఉన్నాను. బ్యాంక్ రుణం ఇప్పించి జీవనాధారం కల్పించాలి' అని వేడుకున్నాడు.

రైతు బంధు ఆపేసింద్రు



బచ్చన్నపేటకు చెందిన మర్కా సిద్దయ్యకు 175ఏ2, 175బీ2, 175సీ2,176ఏ2, 176బీ2, 176సీ2 సర్వే నంబర్లలో 5.24 ఎకరాల భూమి ఉంది. గత ఏడాది రైతుబంధు యాసంగి పెట్టుబడి సాయం అందకపోవడంతో అధికారుల వద్దకు వెళ్లినా ఫలితం లేదు. రైతుబంధు డబ్బులు ఇప్పించాలని సిద్దయ్య కుమారుడు సందీప్ అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశాడు.

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి



రఘునాథపల్లి మండలం భానాజీపేట గ్రామంలోని వాగు కారణంగా వర్షాకాలం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో నిండు గర్భిణితో పాటు ముగ్గురు గల్లంతయ్యారు. ప్రమాదాల నివారణకు బ్రిడ్జి ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన బిట్ల పాపయ్య విన్నవించాడు.

పెన్షన్ మార్చారు



జనగామ మండలం యశ్వంతాపూర్ గ్రామానికి చెందిన గద్దం సుగుణ భర్త ఏబెల్ ఏడాదిన్నర క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. గతంలో పెన్షన్ వస్తుండగా స్పౌజ్ కింద దరఖాస్తు చేసుకోగా.. సంబంధిత జీపీ కార్యదర్శి వితంతు కింద మార్చి పంపారు. ఇప్పుడు ఏ పెన్షన్ రావడంలేదు. భర్త పెన్షన్ అందేలా చూడాలని సుగుణ అర్జీ పెట్టుకుంది.

రికవరీ ఎత్తివేయాలి

ఉపాధి పథకానికి సంబంధించి తరిగొప్పుల మండల పరిధి పలు గ్రామాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీలో పంచాయతీ సిబ్బందిపై రికవరీ అమౌంట్ వేశారు. చిన్న వేతనాలతో బతుకుతున్న తాము ఆమొత్తం చెల్లించలేమని, రికవరీ ఎత్తివేయాలని అంకుషాపూర్, నర్సాపూర్, సోలీపూర్, అబ్దుల్ నాగారం, బొంతగట్టునాగారం పంచాయతీ సిబ్బంది వినతిపత్రం అందజేశారు.



డబుల్ బెడ్రూం ఇప్పించాలి



జనగామ మండలం ఎర్రగొల్లపహాడ్ జీపీ పరిధి కొత్తతండాకు చెందిన తేజావత్ దివ్య బతుకుదెరువు కోసం జనగామ పట్టణంలో అద్దె ఇంట్లో ఉంటోంది. భర్త భోజీ కూలీ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఐదేళ్ల క్రితం భోజీ రెండు కిడ్నీలు పాడయ్యాయి. కుటుంబం గడవడమే కష్టంగా ఉంది. ఇంటి అద్దె చెల్లించలేని పరిస్థితి ఉంది. డబుల్ బెడ్రూం ఇప్పించి ఆదుకోవాలని దివ్య అర్జీ పెట్టుకుంది.

భూమి ఉందని..



లింగాలఘణపురం మండలం జీడికల్‌కు చెందిన శనిగరం కావ్య భర్త రామకృష్ణ రెండేళ్ల క్రితం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. కావ్యకు ఇద్దరు ఆడపిల్లలు. భర్త భూమి కావ్య పేరున ఇటీవల మార్చారు. ఇప్పటి వరకు వచ్చిన వితంతు రావడంలేదు. ఇప్పించి ఆదుకోవాలని కావ్య వేడుకుంది.

శిక్షణకు వంద మంది నమోదు

కేయూ క్యాంపస్: కేయూలో నిర్వహిస్తున్న వివిధ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ కోసం వంద మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారని పోటీ పరీక్షల కేయూ డైరెక్టర్ డాక్టర్ టి.నాగయ్య సోమవారం తెలిపారు. ఇప్పటికే పోటీ పరీక్షల ఉచిత కోచింగ్ క్యాంపస్‌లోని ఫిజిక్స్ విభాగం సెమినార్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జీకే, లేటెస్ట్ కరెంట్ అఫైర్స్ అంశాలపై పోటీ పరీక్షల నిపుణులు కె.మధు ఉపన్యసించారని తెలిపారు. ఈనెల 7, 8 తేదీల్లో జీకే, కరెంట్ అఫైర్స్‌కు సంబంధించిన ఫ్రీ కోచింగ్ క్లాసులు 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాల పట్టాలివ్వాలి

- ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా

జనగామ: ఇళ్లు లేని నిరుపేదల స్వాధీనంలో ఉన్న ఇంటి స్థలాలకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘాలు, కేవీపీఎస్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం సంఘాల నాయకులు కనకారెడ్డి, వెంకటరాజం, శేఖర్ మాట్లాడుతూ.. ఇంటి స్థలానికి పట్టాతోపాటు రూ.5లక్షలు ఇవ్వాలని, గుడిసె వాసులపై దాడులను అరికట్టి, కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ ప్రఫు ల్ దేశాయ్ వద్దకు వెళ్లి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ధర్నాలో రమేష్, దేవదానం, పి.ఉపేందర్, మహేందర్, గోసంగి శంకరయ్య, పల్లెర్ల లలిత, శ్రావణ్, చిరంజీవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న నాయకులు

క్లుప్తంగా

అత్యాశకు పోతే.. అసలు పోయింది!

రూ.87,049లు ఖాతా నుంచి మాయం



కాజీపేట: సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మిన ఓ నిట్ విద్యార్థి అత్యాశకు పోయింది. అసలు పోగొట్టుకుంది. ఈఘటనపై సోమవారం కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్‌రెడ్డి తెలిపారు. నిట్ విద్యార్థి ఫోన్‌కు ఓ లింక్ వచ్చింది. అది ఓపెన్ చేయగా.. తామిచ్చే టాస్క్‌లు పూర్తి చేస్తే డబ్బులు ఖాతాలో పడతాయంటూ నమ్మించారు. వీరి మాటలు నమ్మిన ఆవిద్యార్థిని ఓటాస్క్ పూర్తి చేయగానే ఆమె ఖాతాలోకి రూ.330 జమయ్యాయి. మరిన్ని టాస్క్‌లు పూర్తి చేయడానికి యత్నించగా ఆమె ఖాతాలో ఉన్న రూ.87,049 డబ్బులు మాయమయ్యాయి. ఆతర్వాత ఆమె పోలీసులను ఆశ్రయించింది.

కుక్కల దాడిలో 13 గొర్రెలు మృతి



కురవి: సీరోలు మండలం ఉప్పరిగూడెంలో గొర్రెల మందపై ఆదివారం రాత్రి కుక్కలు దాడికి పాల్పడ్డాయి. ఈఘటనలో 13 గొర్రెలు, గొర్రెపోతులు మృతి చెందాయి. మరో రెండు గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. ఉప్పరిగూడేనికి చెందిన గొర్రెలకాపరి తోట అబ్బయ్యకు చెందిన గొర్రెల మందను ఆదివారం రాత్రి దొడ్లో ఉంచారు. ఆ మందను చూసుకోమని పక్కింటి వారికి చెప్పి అబ్బయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి సూర్యాపేట జిల్లాలోని జాతరకు వెళ్లొచ్చాడు. ఆసమయంలో కుక్కలు దాడి చేశాయి . ఈఘటనలో సుమారు రూ.1లక్ష నష్టం జరిగిందని, పరిహారం చెల్లించాలని బాధితుడు ప్రభుత్వాన్ని కోరుతున్నాడు.

కోర్టుల్లో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం

కార్యాలయాన్ని ప్రారంభించిన హనుమకొండ, వరంగల్ ప్రధాన న్యాయమూర్తులు



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న న్యాయమూర్తులు కె.రాధాదేవి, ఎం.కృష్ణమూర్తి

వరంగల్ లీగల్: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు తెలంగాణ వ్యాప్తంగా 16 జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంను సోమవారం రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ వర్చువల్ ద్వారా ప్రారంభించారు. ఈకార్యక్రమంలో వారితో పాటు రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి.నవీన్‌రావు, హైకోర్టు న్యాయమూర్తులు పాల్గొన్నారు. అనంతరం వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు కె.రాధాదేవి, ఎం.కృష్ణమూర్తి జిల్లాలోని కోర్టు భవన ప్రాంగణంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం హనుమకొండ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా నియమితులైన డి.శ్రీకాంత్, వరంగల్ డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా నియమితులైన ఆర్.సురేశ్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఆర్.రజినిలను అభినందించారు. పేదవారికి, మహిళలకు, వృద్ధులకు అన్యాయం జరగకుండా చట్టం దృష్టిలో అందరూ సమానులే అనే ఉద్దేశ్యంతో పని చేయాలని సూచించారు. సాయం కోసం వచ్చిన ప్రతివాదుల వాదనలను అర్థం చేసుకొని, న్యాయం జరిగేలా సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శులు జె.ఉపేందర్‌రావు, బి.శ్రీనివాసులు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ.ఆనంద్‌మోహన్, శ్రీనివాస్‌గౌడ్, వరంగల్, హనుమకొండ జిల్లాల ఆర్డీఓలు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

అభివాదం చేస్తూ.. ఆప్యాయంగా పలకరిస్తూ

- కొనసాగిన వైఎస్ షర్మిల పాదయాత్ర
- భారీగా పాల్గొన్న జనం



ప్రజలకు అభివాదం చేస్తున్న షర్మిల

హన్మకొండ అర్బన్/కాజీపేట/కాజీపేట రూరల్/చిల్పూరు: వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల ప్రజా ప్రస్థానం పాదయాత్ర సోమవారం వరంగల్ నగరంలో కొనసాగింది. ఉదయం హనుమకొండ బాల సముద్రంలోని మైదానంలో విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పని తీరు, ఆపార్టీ అధినేత కేసీఆర్‌పై నిప్పులు చెరిగారు. అనంతరం బాలసముద్రం, నక్కలగుట్ట, అదాలత్, కలెక్టరేట్, నిట్, ఫాతిమానగర్ కాజీపేట మీదుగా పాదయాత్ర సాగింది. ఈసందర్భంగా పలువురు పార్టీలో చేరగా.. షర్మిల కండువా కప్పి ఆహ్వానించారు. కాజీపేట చౌరస్తాకు చేరుకున్న షర్మిల ప్రజలనుద్దేశించి ప్రసంగించడానికి ప్రయత్నించగా రహదారులకు ఇరువైపులా ట్రాఫిక్ భారీగా స్తంభించింది. ప్రజల ఇబ్బందులు గుర్తించిన షర్మిల కాజీపేటలో ఎక్కడా మాట్లాడకుండా ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. మడికొండసెంటర్, రాంపూర్ మెయిన్ రోడ్డు మీదుగా పాదయాత్ర సాగింది. డీజిల్ కాలనీ–మడికొండ మధ్య ఒక దివ్యాంగుడు షర్మిలను శాలువాతో సన్మానించేందుకు రాగా.. అదే శాలువా తీసుకుని షర్మిల ఆ దివ్యాంగుడిని సన్మానించారు. కాగా.. చిల్పూరు మండలం వంగాలపల్లి గ్రామానికి సోమవారం పాదయాత్ర చేరుకున్నారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ నాయకులు నాడెం శాంతికుమార్, పిట్ట రాంరెడ్డి, చల్లా అమరేందర్‌రెడ్డి, కొటిల్‌రెడ్డి, సుమిత్, బోడ్డు శ్రావణ్‌కుమార్, ఎన్.రజినీకాంత్, డి.ప్రకాశ్, ఎస్.రఘు, జి.సమ్మయ్య, ఊరడి శ్రీనివాస్, సంగాల ఈర్మియా, చింతకింది శ్రీహరి, భాస్కర్, దిలీప్, ప్రశాంత్, ఆంజనేయులు, విష్ణు, నరేశ్, మున్నా ఉన్నారు.

యాచకురాలికి కన్నీటి వీడ్కోలు

- చితికి నిప్పంటించిన సర్పంచ్ లక్ష్మణ్‌రావు
- మానవత్వం చాటుకున్న బొద్దుగొండ గ్రామస్తులు



యాచకురాలి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ లక్ష్మణ్‌రావు

గూడూరు: అయినవాళ్లు జీవిడిస్తేనే కాల్చడానికో, పూడ్చడానికో నువ్వంటే నువ్వని తగాదాలు పడే రోజులివి. తమకేమీ కాని ఓ యాచకురాలి కోసం ఆ గ్రామస్తులు, సర్పంచ్ కన్నీళ్లు కార్చారు. ఘనంగా అంతిమయాత్ర నిర్వహించి దహన సంస్కారాలు జరిపించారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బొద్దుగొండలో దాదాపు 40 ఏళ్లుగా వీరమ్మ యాచకురాలిగా బతుకీడుస్తోంది. ఆదివారం రాత్రి ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆమె మృతి చెందింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ ముక్కా లక్ష్మణ్‌రావు, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు ఎండి. ఖాసీం, గ్రామస్తులు ఎంతో ఖర్చు పెట్టి అంతిమయాత్ర, దహన సంస్కారాలు నిర్వహించారు. శ్మశానవాటిక వరకు డప్పుచప్పుళ్లు, మేళతాళాలతో తీసుకెళ్లారు. గ్రామస్తులు, గ్రామ సర్పంచ్ ఆమె చితికి నిప్పంటించారు. ఎస్సై సతీశ్‌గౌడ్ కూడా వీరమ్మ అంతిమ సంస్కారాల్లో పాల్గొన్నారు.

పీఆర్సీ ఎరియర్స్ చెల్లించాలని వినతి

కేయూ క్యాంపస్: కేయూలోని రిటైర్డ్ ప్రొఫెసర్లకు పీఆర్సీ ఎరియర్స్ చెల్లించాలని కేయూ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు (కుర్తా) ప్రొఫెసర్ ఎ.సదానందం, జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ వడ్డె రవీందర్ ఇతర బాధ్యులు వీసీ రమేశ్‌ను, రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావును కలిసి వినతి పత్రం అందించినట్లు అసోసియేషన్ బాధ్యులు సోమవారం తెలిపారు. ఈపీఆర్సీ ఎరియర్స్‌లో కేవలం 25 శాతం మాత్రమే చెల్లించారని మిగతా 75 శాతం ఎరియర్స్‌ను చెల్లించాల్సి ఉందని వీసీ, రిజిస్ట్రార్ల దృష్టికి తీసుకెళ్లారు. వినతి పత్రం అందించిన వారిలో జాయింట్ సెక్రటరీ డాక్టర్ వి.కృష్ణారెడ్డి, కోశాధికారి జి.వీరన్న ఉన్నారు.

10 నుంచి పీజీ సెకండియర్ ఫస్ట్ సెమ్

కేయూ క్యాంపస్: కేయూ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో అన్ని పీజీ కోర్సుల సెకండియర్ మొదటి సెమిస్టర్ పరీక్షలు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) ఈనెల 10 నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.జ్యోతి సోమవారం తెలిపారు. అన్ని పీజీ కోర్సుల సెకండియర్ మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 10, 13, 15, 17, 20, 22 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈపరీక్షల నిర్వహణకు 32 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా.. అందులో 6,794 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

బడ్జెట్‌లో అధిక నిధులు తేవాలి

- ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీల ఫొటోలకు జేఏసీ పూజలు



ఫ్లెక్సీకి పూజలు చేస్తున్న నాయకులు

జనగామ: జిల్లా కేంద్రంతోపాటు నియోజకవర్గ అభివృద్ధికి బడ్జెట్‌లో అత్యధిక నిధులు కేటాయించేలా చూడాలని జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ఆర్టీసీ చౌరస్తా వద్ద ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫొటోలకు పూజలు చేసి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా జేఏసీ కన్వీనర్ మంగళ్లపల్లి రాజు, నాయకులు తుంగ కౌశిక్, వేంపటి అజయ్, భువన, దినేష్, రాజు, శ్రీకాంత్, శివ, సుకన్య, అంకిత తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌పై అభిప్రాయాలు..

ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టింది



ఈ బడ్జెట్ పల్లెకు పట్టం కట్టింది. ప్రజల ఆకాంక్షలకు అద్దం పడుతోంది. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణప్రగతి పథంలో పయనిస్తోంది. ఏటేటా బడ్జెట్ నిధులు పెంచుకుంటూ.. ప్రజల సమగ్ర సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నారు. ఇందులో రూ.31,426 కోట్లు కేటాయించి పంచాయతీ రాజ్ శాఖకు సింహ భాగం కేటాయించడంపై సీఎం కేసీఆర్, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావుకు ధన్యవాదాలు.

– మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

విద్యారంగంపై నిర్లక్ష్యం

విద్యను ప్రాధాన్యతా రంగంగా గుర్తించడం లేదని మరోసారి రుజువైంది. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో విద్యారంగానికి అత్యల్పంగా రూ.19వేల కోట్లు(6.57 శాతం) మాత్రమే కేటాయించింది. ఇందులో పాఠశాల విద్యకు 5.54శాతమే కేటాయించడం విచారకరం. 'మనఊరు– మనబడి'కి ప్రత్యేక కేటాయింపులు కనిపించలేదు.

– ఇప్ప రాంరెడ్డి, వి.దివాకర్‌రెడ్డి, డీటీఎఫ్, జనగామ

గతం కంటే ఎక్కువ కనిపించినా..



పాఠశాల విద్యకు రూ.16వేల కోట్లు, ఉన్నత విద్యకు 3వేల కోట్లు(1శాతం) ఇవ్వడం బాధాకరం. గత బడ్జెట్ కేటాయింపుల కంటే 0.31శాతం ఎక్కువ కనిపించినా.. పదోన్నతులు, పెండింగ్ కరువు భత్యం, పెండింగ్ బిల్లుల క్లియరెన్స్, రెండో దఫా ×మన ఊరు–మనబడి× పూర్తి స్థాయి అమలుకు ప్రత్యేక కేటాయింపులు లేకపోవడం దారుణం.

– డి.శ్రీనివాస్, టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఉన్నత విద్యకూ నామమాత్రమే..



ప్రత్యేక తెలంగాణ ఏర్పడే నాటికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యా రంగానికి బడ్జెట్‌లో 10 శాతం కేటాయించింది. ప్రస్తుతం రూ.29వేల కోట్ల పైచిలుకు కేటాయించాల్సి ఉంది. ఉన్నత విద్యకు సంబంధించి రూ.3వేల కోట్లు(1శాతం), ఇందులో నుంచి రూ.500 కోట్లు విశ్వవిద్యాలయాల్లో కనీస మౌలిక వసతుల కల్పనకు కేటాయించడం నామమాత్రమే.

– బి.లక్ష్మయ్య, టీపీటీఎఫ్, జిల్లా అధ్యక్షుడు

ప్రజా, రైతు సక్షేమం..



ప్రజా, రైతు సంక్షేమమే ధ్యేయంగా బడ్జెట్ ఉంది. సొంత ఖాళీ స్థలం ఉన్న కుటుంబాలకు రూ.3 లక్షలతో ఇల్లు కట్టుకోవడానికి, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు, ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఉపయోగపడే ఈహెచ్‌ఎస్‌కు నిధులు కేటాయించారు. గ్రామీణ ప్రాంత రహదారుల నిర్మాణం, మరమ్మతులపాటు ఆర్‌అండ్‌బీ శాఖకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చారు. రైతుబంధు, రైతు బీమా, దళిత బంధు పథకాలకు, రుణమాఫీకి నిధులిచ్చారు. పరిశ్రమల స్థాపనకు ముందుకువచ్చే వారికి ప్రోత్సాహకాలను పెంచారు.

– గంగిశెట్టి ప్రమోద్‌కుమార్, జీఎస్‌టీ ఆడిటర్, జనగామ

నీళ్లనుకొని గడ్డి మందు తాగిన చిన్నారులు

- ఆస్పత్రిలో చికిత్స



మహబూబాబాద్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

కురవి: మండలంలోని మొగిలిచర్ల శివారు జగ్యాతండా(ఎల్‌జే తండా) జీపీలో సోమవారం ఇద్దరు చిన్నారులు మంచి నీళ్లు అనుకుని గడ్డి మందు (కలుపు నివారణ మందు) తాగారు. తండాకు చెందిన లూనావత్ మల్సూర్–అనిత దంపతులకు మూడేళ్ల జయశ్రీ, ఏడాదిన్నర వయసున్న ప్రభాస్ ఉన్నారు. సోమవారం పిల్లల్ని తీసుకుని వారు తమ మిరప తోటకు వెళ్లారు. పిల్లల్ని, మల్సూర్ తమ్ముడి కొడుకును చెట్టు కింద ఆడుకోమని చెప్పి ఆ దంపతులిద్దరూ మిరపకాయలు ఏరుతున్నారు. పిల్లలు ఆడుతున్న చోటే గడ్డి మందు డబ్బాలు, మంచి నీళ్లు ఉన్నాయి. ఈక్రమంలో జయశ్రీ, ప్రభాస్ మంచినీళ్లు అనుకుని పురుగుల మందు తాగారు. మల్సూర్ తమ్ముడి కొడుకు సైతం తనకు ఆ డబ్బా ఇవ్వాలని జయశ్రీని అడగ్గా.. ఇవ్వలేదు. దీంతో అతడు ఏడుస్తూ వెళ్లి తోటలో పని చేస్తున్న మల్సూర్, అనితకు డబ్బా ఇవ్వడం లేదనే విషయాన్ని చెప్పాడు. అనుమానం వచ్చిన మల్సూర్, అనిత చెట్టు కిందికి వచ్చి చూసి పిల్లలిద్దరూ గడ్డి మందు తాగినట్లు గుర్తించారు. రోదిస్తూ పిల్లలను మహబూబాబాద్‌లోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. అత్యవసర చికిత్స విభాగంలో ఇద్దరు చిన్నారులకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. వారి పరిస్థితి విషమంగానే ఉందని, 24 గంటల తర్వాత పరిస్థితి తెలియజేస్తామని వైద్యులు తెలిపారు.

కుటుంబ కలహాలతో భార్య, కొడుకుపై దాడి

నర్సంపేట: కుటుంబ కలహాలతో మండలంలోని చంద్రయ్యపల్లిలో సోమవారం నిడిగొండ కోటిలింగం తన భార్య విజయ, కుమారుడు ప్రవీణ్‌పై కత్తితో దాడి చేసి గాయపర్చాడు. కోటిలింగం భార్య, కుమారుడితో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. నిత్యం కుటుంబీకులతో గొడవ పడుతుండేవాడు. పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ నిర్వహించినా తరచూ గొడవలు జరిగేవి. ఈక్రమంలో వారి స్వగ్రామం చంద్రయ్యపల్లి చేరుకుని మాట్లాడుకుంటున్న సమయంలో కోటిలింగం కోపంతో భార్య, కుమారుడిపై ఒక్క సారిగా కత్తితో దాడికి దిగాడు. విజయ గొంతు భాగంలో, ప్రవీణ్ ఛాతిపై తీవ్రంగా గాయపర్చాడు. గమనించిన స్థానికులు వారిని నర్సంపేట ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. కోటిలింగం పరారీలో ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యుడి అరెస్ట్



దొంగల ముఠా సభ్యుడితో ఏసీపీ రఘుచందర్, సీఐ సంతోశ్

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్ల బైపాస్ సమీపంలో గతేడాది సెప్టెంబర్‌లో దొంగతనానికి పాల్పడి 25 తులాల బంగారం చోరీ చేసిన ఘటనలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యుడు సోనుసింగ్ చౌహాన్ అలియాస్ సంగ్రామ్ సింగ్‌ను అరెస్టు చేసినట్లు ఏసీపీ రఘుచందర్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన ఎనిమిది మంది గతేడాది నెల్లుట్ల సమీపంలో ఒంటరిగా ఉంటున్న ఓ మహిళ ఇంట్లో చొరబడి 25 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. ఆఘటనలో అప్పుడే పరాన్‌ఖాన్ అనే నిందితున్ని అరెస్టు చేసి ఆరు తులాల బంగారం రికవరీ చేశామని, మిగిలిన నిందితులు ఉత్తరప్రదేశ్‌లోని బగాయ్ జిల్లాలో ఉంటున్నారనే సమాచారం మేరకు సీఐ సంతోశ్, ఎస్సై ప్రవీణ్ ఆధ్వర్యంలో పోలీసు బృందం అక్కడికి వెళ్లి సోనుసింగ్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. అక్కడికి వెళ్లి నిందితున్ని అరెస్టు చేయడంతో సీఐ సంతోశ్, ఎస్సై ప్రవీణ ఎంతో చాకచక్యంతో వ్యవహరించడంపై ఏసీపీ రఘుచందర్ వారిని అభినందించారు. నిందితుడి నుంచి తులంన్నర బ్రాస్‌లైట్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామని, మిగిలిన నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



అబాకస్‌లో బహుమతులు గెలుచుకున్న విద్యార్థులు

హన్మకొండ: అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో ఉమ్మడి వరంగల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. ఆన్‌లైన్‌లో అబాకస్ విద్యను అభ్యసిస్తూ ఆన్‌లైన్ అబాకస్ పరీక్ష రాసి వివిధ కేటగిరీల్లో బహుమతులు గెలుచుకున్నారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అలామా ఇంటర్‌నేషనల్ డైరెక్టర్ జి.ముత్తుకుమార్ వరంగల్, హనుమకొండ, కాజీపేటతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు బహుమతులు ప్రదానం చేశారు. కాజీపేటకు చెందిన ఎం.క్రిషవ్‌రాజ్ ప్రథమ బహుమతితో పాటు చాంపియన్ ట్రోఫీ గెలుచుకున్నారని అబాకస్ ట్రైనర్ పి.నరేశ్‌గుప్త తెలిపారు. తొర్రూరుకు చెందిన వి.సుశాంత్, వరంగల్‌కు చెందిన ఎం.సిరిచందన, భూపాలపల్లికి చెందిన బి.సాయి కార్తీక్, హనుమకొండకు చెందిన జశ్వంత్ మాధవ్, ఇతర విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నట్లు వివరించారు.

విద్యార్థి ఆత్మహత్య

దేవరుప్పుల: మండల కేంద్రానికి చెందిన పదో తరగతి విద్యార్థి దండెంపల్లి అభినయ్(15) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కొడకండ్ల మండలం నర్సింగాపురం గ్రామానికి చెందిన ఆదనంద్ దేవరుప్పులలో విద్యుత్ శాఖలో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తూ ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి ఉద్యోగం భార్య సుజాతకు వచ్చింది. ఈక్రమంలో దేవరుప్పులలో ఉంటూ కుమారుడు అభినయ్‌ని ఓప్రైవేట్ పాఠశాలలో చదివిస్తోంది. రెండ్రోజులుగా పాఠశాలకు వెళ్లకుండా అభినయ్ ఇంటివద్దే ఉంటున్నాడు. ఈక్రమంలో సుజాత జనగామలో విధులు ముగించుకొని రాత్రి 7 గంటలకు వచ్చేసరికి తలుపులు వేసి ఉన్నాయి. అనుమానం వచ్చి కిటికీలోంచి చూడగా.. అభినయ్ ఉరేసుకుని కనిపించాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. భర్త, కొడుకు మృతితో సుజాత అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆమెను జనగామ ఆస్పత్రికి తరలించారు. అభినయ్ మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

'అదాని'పై అంత ప్రేమ ఎందుకు



బైఠాయించి ధర్నా చేస్తున్న జంగా రాఘవరెడ్డి, తదితరులు

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు 'జంగా'

జనగామ: కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసీ, ఎస్‌బీఐ నుంచి అదాని గ్రూపులకు బలవంతంగా పెట్టుబడులు చేసేలా ఒత్తిడి చేస్తోందని.. ఆ సంస్థపై అంత ప్రేమ ఎందుకని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి అన్నారు. ప్రధాని మోదీ స్నేహితుడు అదాని సంస్థల్లోకి ప్రభుత్వ రంగాల పెట్టుబడులను నిరసిస్తూ సోమవారం జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతనం రాఘవరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలీసులను అడ్డం పెట్టుకుని సామాన్యుల రెక్కల కష్టాన్ని పొదుపు పేరిట నట్టేట ముంచుతున్నాయని అన్నారు. ధర్నా విషయం తెలుసుకున్న సీఐ ఎలబోయిన శ్రీనివాస్, ఎస్సై జీనత్ సిబ్బందితో చేరుకుని జంగాను అరెస్ట్ చేసే క్రమంలో కార్యకర్తలు అడ్డుకోవడంతో ఇరువురి మధ్య తోపులాట చోటుచేసుకుంది. దీంతో రాఘవరెడ్డి సిద్దిపేట రోడ్డుపై బైఠాయించగా.. పోలీసులు బలవంతంగా వాహనంలో ఎక్కించి పీఎస్‌కు తరలించారు. రెండు గంటల తర్వాత సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్, ఎర్రమల్ల సుధాకర్, మేడ శ్రీనివాస్, గంగం బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హామీలు నెరవేర్చాలి



దీక్షకు మద్దతు తెలుపుతున్న రాఘవరెడ్డి

జనగామ: గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సేవాలాల్ సేన ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరాహార దీక్ష, నిరసన కార్యక్రమం చేపట్టారు. దీక్షకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి సంఘీభావం తెలిపారు. అనంతరం సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధారావత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. సేవాలాల్ మహరాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించి ఆ రోజు సెలవు దినంగా ప్రకటించాలని, ఏటా ఉత్సవాలకు ముందే జిల్లాకు రూ.10లక్షల చొప్పున విడుదల చేయాలని, గిరిజన హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి దీక్షను ప్రారంభించారు. భూక్యా రాజు, బానోత్ మహేందర్, కొర్ర రంగ్యానాయక్, బానోత్ సృజన్, మూడవత్ రాజు, లావుడియా అనిల్‌చౌహాన్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి దీక్షకు మద్దతు పలికి విరమింప జేశారు.